క్లుప్తంగా

ప్రజలకు నాణ్యమైన మాంసాన్ని విక్రయించాలి



మాంసం దుకాణాలు తనిఖీ చేస్తున్న శానిటరీ సెక్రటరీలు

పులివెందుల టౌన్: ప్రజలకు నాణ్యమైన మాంసాన్ని విక్రయించాలని సచివాలయ శానిటరీ సెక్రటరీలు మాంసం దుకాణ యజమానులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ రాముడు ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలోని పలు మాంసం, చేపల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాంసం విక్రయదారులు ప్రభుత్వ నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వాడరాదన్నారు. విరుద్ధంగా వ్యవహరిస్తే షాపు లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు.

పనిచేయని ఏటీఎంలు



కెనరా బ్యాంకు ఆవరణలోని ఏటీఎం

పులివెందుల రూరల్: పట్టణంలోని కెనరా, ఏపీజీబీ బ్యాంకులకు సంబంధించిన ఏటీఎంలు నాలుగు రోజులుగా పనిచేయకపోవడంతో ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. పార్నపల్లె బస్టాండు సమీపంలోని కెనరా బ్యాంకు ఆవరణంలోని ఏటీఎం, లక్ష్మీ హాల్ సమీపంలోని ఏపీజీబీ ఏటీఎంలు పనిచేయడం లేదు. బ్యాంకు అధికారులకు అనేకమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని వినియోగదారులు చెబుతున్నారు. బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి ఎటీఎంలు పనిచేసేలా చూడాలని కోరుతున్నారు.

గంగమ్మ తల్లికి విశేష పూజలు



గంగమ్మ తల్లి

చింతకొమ్మదిన్నె: మండలంలోని కొత్తపేట గంగమ్మ తల్లి దర్శనానికి ఆదివారం భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు, నగలు, గంధం, పసుపు, వేపాకు, ప్రత్యేక పూలమాలలతో విశేషంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి తమ మొక్కుబడులు, ముడుపులను అమ్మవారికి చెల్లించుకున్నారు. జంతుబలి ఇచ్చిన అనంతరం బంధు మిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. అలాగే గంగమ్మ ఆలయం సమీపంలోని వీరభద్రస్వామి, శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయాలలో భక్తులు పూజలు చేశారు. బలిజపల్లె గ్రామస్తులు అంకాలమ్మ జాతరను భక్తి శ్రద్ధలతో జరుపుకొని బోనాలు సమర్పించుకున్నారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కమలాపురం: జవహర్ నవోదయా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ బేబి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే ఈ పరీక్షకు ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో ఈ నెల 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సన్నారు. వివరాలకు నవోదయ వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవాలన్నారు.

రోడ్డుకు అడ్డంగా వాహనాలు పెడితే జరిమానా



వీధులలో నడుస్తున్న ఎస్‌ఐ రవికుమార్

సింహాద్రిపురం: రోడ్డుకు అడ్డంగా వాహనాలు పెడితే జరిమానా తప్పద ని ఎస్‌ఐ రవికుమార్ హెచ్చరించారు. సింహాద్రిపురం ప్రధాన వీధులలో ఆదివారం ఆయన నడుస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. అడ్డంగా ఉన్న వాహనాలను తీయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనాలు రోడ్డుకు అడ్డదిడ్డంగా పెట్టి రవాణా వ్యవస్థకు అంతరాయం కలిగించిన వాహనంపై జరిమానా విధించి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు వైద్య పరీక్షలు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఏపీ ఎన్జీఓ కార్యాలయంలో ఆ సంఘం అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పట్టణంలోని హోలిస్టిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 150 మంది ఉద్యోగులు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. బీపీ, షుగర్ వ్యాధి, గుండెకు సంబంధించిన ఈసీజీ, 2డి ఎకో పరీక్షలు నిర్వహించారు. గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ రాజశేఖర్ వర్మ, డాక్టర్ బీఎల్ఎన్‌రెడ్డి, డాక్టర్ నాగశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నరసింహారావు, పీఆర్‌ఓ ప్రతాప్, సిబ్బంది పాల్గొని వైద్య సేవలు అందించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీఓస్ అసోసియేషన్ ప్రతినిధులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

చీనీ కాయల ధరలు పతనం

చీనీ ధర పతనమవుతోంది. వేల రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు దిగుబడులు తగ్గడంతో ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు తెగుళ్ల బెడద వారిని పట్టి పీడిస్తోంది. చీనీ సాగులో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్న సింహాద్రిపురం మండలం చివరి స్థానంలో నిలబడాల్సిన పరిస్థితి తలెత్తుతోంది.

- తెగుళ్లతో తగ్గిన దిగుబడులు
- ఆందోళనలో చీనీ రైతులు



చీనీ కాయలు గ్రేడింగ్ చేస్తున్న వ్యవసాయ కూలీలు

సింహాద్రిపురం: సింహాద్రిపురం మండలం చీనీ సాగుకు ప్రసిద్ధి. ఎగుమతిలో మొదటి స్థానంలో ఉండగా, దిగుబడిలోనూ, నాణ్యమైన అంట్ల అమ్మకాలలోనూ తొలిస్థానంలో ఉంది. మండల వ్యాప్తంగా 18 వేల ఎకరాలలో రైతులు చీనీ పంట సాగు చేశారు. అందుకు అనుగుణంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పులివెందులలో ఘాట్ లేకుండా చీనీ కాయలు అమ్మేందుకు మార్కెట్ ఏర్పాటుచేసింది. అంతేగాక అనంతపురం నుంచి ఢిల్లీకి నేరుగా ఎగుమతి చేసేందుకు రైళ్లను కూడా ఏర్పాటుచేశారు.

తెగుళ్లతో తగ్గిన దిగుబడులు

ఈ ఏడాది బంక తెగులు, వేరుకుళ్లు తెగుళ్లతో దాదాపు 30 నుంచి 40శాతానికి చీనీ సాగు తగ్గిపోయింది. దిగుబడులు తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మరో పక్క చీనీ ధర పతనం కావడంతో రైతులు కుదేలవుతున్నారు. గత ఏడాది టన్ను చీనీ ధర రూ.60 వేల నుంచి రూ.80 వేలు పలకగా, ఈ ఏడాది రూ.10 వేల నుంచి రూ.20 వేలు ఉండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఎరువుల ధర పెరగడంతో కూలీ రేట్లు డబుల్ కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చీనీ రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ.20 వేల నష్టపరిహారం కింద అందించారు. ఉత్తరాదిన ధరల స్థిరీకరణ చేసి వ్యాపారస్తులు రప్పించి అనంతపురానికి రైలును పునరుద్ధరించాల్సి ఉంది.



తెగుళ్లతో ఎండుతున్న చీనీ చెట్లు

తెగుళ్లతో అన్నీ కష్టాలే



చీనీ రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. ఒక పక్క చీనీ చెట్లకు తెగుళ్లు, మరో పక్క కల్తీ మందులు, ఎరువులు. దీనికి తోడు చీనీ ధరలు పతనం కావడంతో నిరుత్సాహానికి గురవుతున్నాం. కష్టపడి కన్న బిడ్డల్లా పెంచుకున్న చీనీ చెట్లు కళ్లముందర చనిపోతుంటే బాధగా ఉంది. రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

– కొమ్మా నరస్సారెడ్డి, చీనీ రైతు, అంకాలమ్మ గూడూరు

చీనీ రైతులను ఆదుకోవాలి



ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉండడంతో ఎండ తీవ్రతకు చీనీ చెట్లకు తెగుళ్లు సోకి చనిపోతున్నాయి. అన్ని తోటల్లోనూ ఇదే పరిస్థితి. ప్రభుత్వం దెబ్బతిన్న చీనీ రైతులను ఆదుకోవాలి. మార్కెట్లలో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి రైతులను దగా చేస్తున్నారు. రైతులు నష్టపోకుండా ఢిల్లీకి ఎగుమతి చేసేలా రైలు ఏర్పాటు చేయాలి.

– అరవిందనాథరెడ్డి, సింహాద్రిపురం

బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ లోగో ఆవిష్కరణ



బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ లోగోలను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

లింగాల: మండల కేంద్రం లింగాలలో ఆదివారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అంబకపల్లె బాబురెడ్డి, ఎంపీపీ అలవలపాటి రమాదేవి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎంతవరకు అమలు చేసింది?ఎవరెవరికి లబ్ధి చేకూరింది? ఏ పథకాలు ఇంతవరకూ అమలు చేయలేదు? అన్న విషయాలు ప్రజలకు వివరిస్తామన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేశామని గొప్పలు చెప్పుకోవడమేగానీ, ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు పరచలేదన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి మొబైల్‌లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అందులో చంద్రబాబు చెప్పిన మ్యానిఫెస్టో, అమలు చేసిన మేనిఫెస్టో, ఏ విధంగా అన్ని పూర్తి చేశామని మాయ మాటలు చెబుతున్న వీడియోలు వివరించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశం, ఇంతవరకు చంద్రబాబు చెప్పిన సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంవల్ల ఏ కుటుంబానికి ప్రభుత్వం ఎంత బాకీ ఉందనే విషయాలన్నీ యాప్‌లో అప్‌లోడ్ చేయించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అంబకపల్లి బాబురెడ్డి, ఎంపీపీ రమాదేవి, వెలిదండ్ల మల్లికార్జున రెడ్డి, లింగాల సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, పెద్దకూడాల శ్రీనివాస్ రెడ్డి, ఇప్పట్ల సుధాకర్ రెడ్డి, గుణకణపల్లి సూర్యనారాయణరెడ్డి, బాబు రెడ్డి, కర్ణ పాపయ్యపల్లి అంకాల్ రెడ్డి, తేర్నాంపల్లి భాస్కర్ రెడ్డి, అంకేవానిపల్లి భాస్కర్ రెడ్డి, కాటమయ్య, మహేశ్వర రెడ్డి, హరినాథ, బోనాల నిరంజన్ రెడ్డి, బోనాల సర్పంచ్ రామిరెడ్డి, రామట్లపల్లి గంగిరెడ్డి, అంబకపల్లి శ్రీనివాసరెడ్డి, చెన్నకేశవ రెడ్డి, గంగిరెడ్డి సర్పంచ్ భూషణ్ రెడ్డి, కామసముద్రం మునీంద్ర, చిన్నకుడాల, వెలిదండ్ల, తాతిరెడ్డిపల్లి గ్రామాల నాయకులు, లింగాల గ్రామ నాయకులు, కార్యకర్తలు, మండలంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమం కోసం ఎల్లవేళలా కృషి చేస్తా



సూర్యపుత్ర మందును ప్రారంభిస్తున్న శివశంకర్

తొండూరు: రైతు సంక్షేమం కోసం ఎల్లవేళలా కృషి చేస్తానని ఆర్ఎస్ఎస్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్ ఆర్.శివశంకర్ అన్నారు. మండలంలోని గంగనపల్లె వ్యవసాయ క్షేత్రంలో ఆర్ఎస్ఎస్ ఫౌండేషన్ వార్షికోత్సవ వేడుకను ఆదివారం రైతులతో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండ్ల తోటల రైతులకు సూచనలిచ్చే వారులేక ఎన్నోసార్లు పంటను కోల్పోవడం జరిగిందన్నారు. రైతుల కోసం ఏమైనా చేయాలని నిర్ణయించుకుని ఫౌండేషన్ ఏర్పాటుచేసి ఏపీ, తమిళనాడు, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల్లోని ప్రాంతాలకు వెళ్లి పండ్ల తోటల పెంపకంపై తగిన సూచనలు ఇస్తున్నామని తెలిపారు. అనంతరం ఆయన గోమూత్రంతో తయారు చేసిన సూర్యపుత్ర పంట మందును ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు శాస్త్రవేత్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నివారణలో భాగస్వాములు కావాలి



సిద్దయ్య

పులివెందుల రూరల్: వర్షాకాలం నేపథ్యంలో డెంగీ ప్రబలకుండా నివారించడంలో అందరూ భాగస్వాములు కావాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య అన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. డెంగీ అనేది వైరస్ వ్యాధి.. ఇది ఏడీస్ ఈజిప్ట్ అనే దోమ కాటుతో వ్యాపిస్తుందన్నారు. ఈ దోమలు ఎక్కువగా పగటి సమయంలో కుడతాయన్నారు. తలనొప్పి, కంటి వెనుక నొప్పి, కండరాలు కీళ్ల నొప్పులు, చర్మంపై ఎర్రటి మచ్చలు, వాంతులు, బలహీనత, నీరసం లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వాసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకోవాలన్నారు. డెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వర్షపు నీరు ఏ ప్రదేశంలో నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. వారంలో ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. డెంగీ అనుమానిత లక్షణాలు ఉన్న రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

సమాజంలో నైతిక విలువలు పతనం



మాట్లాడుతున్న రిటైర్డ్ ఎస్ఈ శివప్రసాద్‌రెడ్డి

పులివెందుల టౌన్: సమాజంలో నైతిక విలువలు పతనమవుతున్నాయని, విద్యార్థులు ఆ విలువలు పాటించేలా తీర్చిదిద్దాలని ఏపీఎస్పీడీసీఎల్ రిటైర్డు ఎస్ఈ శివప్రసాద్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని స్థానిక చిన్నన్న రూముల వీధిలోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మానవీయ విలువలను పాఠశాల విద్యార్థులకు తెలుపాలన్నారు. మానవతా సంస్థ సాంకేతికను అందిపుచ్చుకొని అందరూ ముందుకు సాగాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు సేవాభావంతో సమాజ సేవ చేయాలని కోరారు. అనంతరం ఎస్ఈ శివప్రసాద్‌రెడ్డి, లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కిరణ్‌కుమార్‌రెడ్డిలను మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ సభ్యులు నాగేంద్ర, శ్రీనివాసరెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు



మృతుడి కుటుంబ సభ్యుల నుంచి కార్నియాలను అందుకుంటున్న రాజు, తదితరులు

లింగాల: నేత్రదానం చేయడంతో ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించ వచ్చునని నేత్ర సేకరణ కేంద్ర అధ్యక్షుడు రాజు పేర్కొన్నారు. మండలంలోని చిన్నకుడాల గ్రామానికి చెందిన వెన్నపూస వెంకటరెడ్డి ఆదివారం మరణించారు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరిస్తూ రాజుకు సమాచారమివ్వడంతో టెక్నీషియన్ అరవింద్‌తో కలిసి మృతుడి ఇంటికి వెళ్లి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రాలయానికి పంపించారు. రాజు మాట్లాడుతూ నేత్రదానం చేయదలుచుకున్న వారు 9966509364 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు. నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు, గ్రామస్తులు, బంధువులు, సన్నిహితులకు కృతజ్ఞతలు తెలిపారు.

అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శం



నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి, తదితరులు

వేంపల్లె: మాజీ భారత రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం అందరికీ ఆదర్శమని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆదివారం కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ ఏపీజే అబ్దుల్ కలాం నిరాడంబరతకు, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. స్వయం కృషి, స్వీయ ప్రతిభతో ఒక సామాన్యుడు అసామాన్యుడు కాగలడని, అలాగే ఒక పేపర్ బాయ్ శాస్త్రవేత్త కాగలడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, వెంకటేష్, బద్రినాథ్, హస్సికారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి



ఒంటేరు శ్రీనివాసులరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న అసోసియేషన్ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : కాంట్రాక్టు అధ్యాపకులను కూటమి ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాంట్రాక్టు లెక్చరర్లకు మినిమం టైం స్కేల్ అమలు చేయించామన్నారు. 12 నెలల వేతనాన్ని పొందేలా ఉత్తర్వులను ఇప్పించి అమలు చేయించామని తెలిపారు. ప్రభుత్వం కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరణ చేసే వరకు వారికి అండగా ఉంటామని చెప్పారు. ఈ సందర్భంగా ఒంటేరు శ్రీనివాసులరెడ్డికి అసోసియేషన్ నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సమావేశంలో ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఎస్సార్ వెంకటజనార్ధన్‌రెడ్డి, ఏపీ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పోలు నాగేంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జిలానీ, మహబూబ్‌బాషా, రామకృష్ణ, రామ మోహన్, చిన్నయ్య, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి

ప్రొద్దుటూరు : వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఆదివారం రాచమల్లు శివప్రసాదరెడ్డిని దొరసానిపల్లెలోని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు ఈ పదవి ఇచ్చినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాచమల్లు శివప్రసాదరెడ్డికి శాలువా కప్పి పూలమాల వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ మండల ఉపాధ్యక్షుడు జంగమయ్య తదితరులు పాల్గొన్నారు.

యూరియా అధిక ధరకు విక్రయిస్తున్నా పట్టించుకోరేం?

ప్రొద్దుటూరు : యూరియాను అధిక ధరలకు అమ్ముతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ విమర్శించారు. ఆదివారం ప్రొద్దుటూరులో ఆయన మాట్లాడుతూ 47 కేజీల యూరియా బస్తా రూ.360కు అమ్మాల్సి ఉండగా రూ.470కిపైగా అమ్ముతున్నారన్నారు. యూరియా కొరత ఉందని, ఎక్కువ ధరకు ఫర్టిలైజర్స్ షాపుల వారు అమ్ముతున్నారని చెప్పారు. పంటలకు సరైన గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే.. ఫర్టిలైజర్ షాపుల వారు మాత్రం రూ.కోట్లు గడించి రైతులతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. నకిలీ విత్తనాలు, విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని తెలిపారు. ఎకరాకు మూడు బస్తాలు అవసరమవుతాయని, కానీ ప్రభుత్వం ఒక బస్తా ఇచ్చి చేతులు దులుపుకొంటోందన్నారు. ప్రభుత్వమే మూడు బస్తాల యూరియా అందించాలని కోరారు.

వేతనాలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న గౌరవాధ్యక్షులు కేసీ బాదుల్లా

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో పని చేస్తున్న రిసోర్స్‌పర్సన్ల(ఆర్పీ)లకు పెండింగ్‌లో ఉన్న 4 నెలల వేతనాన్ని వెంటనే విడుదల చేయాలని మెప్మా ఆర్పీల యూనియన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కేసీ బాదుల్లా డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న అరకొర వేతనాలతో కుటుంబ ఆర్థిక అవసరాలను తీర్చుకోలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు. మెప్మా ఆర్పీలకు అదనపు బాధ్యతలు భారంగా మారుతున్నాయన్నారు. పట్టణాల్లో స్వయం సహాయక మహిళా సంఘాల ఏర్పాటు, వాటి బలోపేత, రుణాలు ఇప్పించడం, సకాలంలో రుణాలు చెల్లించేలా ప్రయత్నాలు చేయడం, పొదుపు పాటింపజేయడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, నిర్ణీత గడువుల్లో మహిళా సంఘాల సమావేశాలు, వార్డు సమాఖ్య సమావేశాలు నిర్వహించి పలు తీర్మానాలు చేయించడం వంటివి చేస్తుంటారన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల సర్వేలు, ఇతర కార్యక్రమాల్లో రిసోర్స్ పర్సన్‌లు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం నెలకు రూ.26 వేతనం పెంచి నేరుగా ఆర్పీల ఖాతాల్లో జమ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు పి.సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



1990-95 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

పెండ్లిమర్రి: మండలంలోని వెల్లటూరు జెడ్పీ హైస్కూల్‌లో 1990–95 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు 30 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకొని ఒకరికొకరి యోగక్షేమాలు తెలుసుకొని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువుతో ఈ రోజు వివిధ స్థాయిలో ఉన్నామని తెలిపారు. తమకు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు



పరుగు పోటీలో క్రీడాకారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఆదివారం బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్ 18, 20 స్త్రీ, పురుషులకు అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. స్త్రీ, పురుషులకు 100 మీటర్లు, 200 మీ., 400 మీ., 800 మీటర్ల పరుగు పోటీలు, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో పోటీలలో క్రీడాకారులు పోటాపోటీగా పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 40 మంది క్రీడాకారులను రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ కార్యదర్శి వై.అహ్మర్ బాషా తెలిపారు. వీరు ఆగస్టు 09, 10, 11వ తేదీల్లో బాపట్లలో జరిగే ఏపీ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన పేర్కొన్నారు. పోటీల నిర్వహణలో వ్యాయామ సంచాలకులు నాగూర్ బాషా, శివారెడ్డి, సుబ్బయ్య, ఎర్రన్న, శంకర్, బి.బాషా, నాగేశ్వరరావు, ఖాదర్‌రెడ్డి, దిలీప్, కోచ్ వివేకానంద రెడ్డి, రబ్బాని, భార్గవ్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్స్ మహాసభలు జయప్రదం చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడపలో ఆగస్టు 30, 31 తేదీలలో జరిగే ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మూడవ మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎస్.వెంకటసుబ్బయ్య అన్నారు. ఆదివారం నగరంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 17 ఏళ్లుగా గర్భవతులు, బాలింతలు, నవజాత శిశువులకు సేవలందిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రజల వద్దకు చేర్చటంలో కీలకపాత్ర పోషిస్తున్న ఆశా కార్యకర్తలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. ఉద్యోగానికి భద్రత లేక కనీస వేతనం లేక గుర్తింపు లేక సంవత్సరానికి 365 రోజులూ సెలవులు లేకుండానే పని చేస్తున్నారన్నారు. ప్రభుత్వాలు ఆశాలతో వెట్టి చాకిరీ చేయించుకోవడం తప్ప వేతనాలు పెంచాలని, ఉద్యోగానికి భద్రత కల్పించాలని ఆలోచన చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఆశా కార్యకర్తల సమస్యల పైన మహాసభలలో చర్చించి, తీర్మానాలు చేసి ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోబోతున్నట్లు తెలిపారు. కడపలో జరుగుతున్నటువంటి ఆశ యూనియన్ మూడవ రాష్ట్ర మహాసభలకు రాష్ట్రంలో ఉన్న ప్రతి జిల్లాలోని ఆశా కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి, 30వ తేదీ ప్రదర్శన బహిరంగ సభ, 31వ తేదీన ప్రతినిధుల సభను జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

తెలుగు భాషా పరిరక్షణకు వినూత్న ప్రణాళికలు అవసరం

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్




మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, సభలో పాల్గొన్న తెలుగు బాషాభిమానులు

కడప ఎడ్యుకేషన్ : తెలుగు భాషా పరిరక్షణకు వినూత్న ప్రణాళికలు అవసరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం తెలుగు భాషా పరిరక్షణ – కార్యాచరణపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ తెలుగు భాష పరిరక్షణ ఇంటి నుంచే ఆరంభించాలని, పిల్లలను ఆ దిశగా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కవులు, రచయితలు, మేధావులు కలసి చర్చాగోష్ఠులు నిర్వహించి భాషా పరిరక్షణకు నడుం బిగించాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన యోగి వేమన విశ్వవిద్యాలయ కులసచివులు (ఇన్‌చార్జ్) ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం తెలుగు భాషా అభ్యున్నతికి కేంద్రంగా ఉంటూ అనేక సాహిత్య కార్యక్రమాలు, పాఠశాల విద్యార్థులకు తెలుగుకు సంబంధించిన పలు రకాల పోటీలు నిర్వహిస్తోందన్నారు. ప్రధాన వక్త, యోగి వేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ప్రతి జిల్లాలో భాషా పరిరక్షణ సమితి ఏర్పాటు చేసి, వాటి నిర్వహణ బాధ్యతలను అధికార భాషా సంఘం చేపట్టాలన్నారు. ఆత్మీయ అతిథులుగా ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి, వైఎస్సార్ కడప జిల్లా బీజేపీ అధ్యక్షులు జంగిటి వెంకట సుబ్బారెడ్డి, ఆంధ్రప్రదేశ్ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్‌రెడ్డి, బీజేవైఎం జాతీయ కార్యదర్శి పనతల సురేష్ తదితరులు పాల్గొన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి సభా సమన్వయం చేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన వ్యక్తులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు.

గానుగపెంట హనుమంతరావుకు సత్కారం

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రముఖ సాహితీవేత్త , భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత, మహాకవయిత్రి మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావును భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, యోగివేమన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ ఘనంగా సత్కరించారు. కడప సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో జరిగిన తెలుగుభాషాపరిరక్షణ కార్యాచరణ సదస్సులో ఈ సత్కారం జరిగింది. కార్యక్రమంలో తెలుగు భాషాభిమానులు, తదితరులు పాల్గొన్నారు.